క్లుప్తంగా

అంగరలో నేడు వైఎస్సార్ సీపీ సమావేశం

కపిలేశ్వరపురం: మండలంలోని వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సమావేశం అంగరలోని పార్టీ మండల కార్యాలయంలో శుక్రవారం నిర్వహించనున్నారు. పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హాజరయ్యే ఈ సమావేశానికి పార్టీకి చెందిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్లు, వార్డు సభ్యులు, గ్రామ కమిటీల అధ్యక్షులు, సభ్యులు, వివిధ విభాగాల బాధ్యులు హాజరుకానున్నట్టు పార్టీ నియోజకవర్గ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

విద్యార్థులకు ప్రతిభా పోటీలు



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కపిలేశ్వరపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ పర్యవేక్షణలో కపిలేశ్వరపురం గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు పలు ప్రతిభా పోటీలను నిర్వహించారు. గ్రంథాలయాధికారి దానేటి శివకుమారి, రీసోర్స్‌పర్సన్ డి.తారక్‌వంశీ ఆధ్వర్యంలో గ్రంథాలయంలో వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించగా, 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.


వర్తక సంఘం ఆర్థిక సాయం



స్వామి కుటుంబ సభ్యుడికి నగదు అందిస్తున్న సంఘ నాయకులు

కాజులూరు: మండలంలోని గొల్లపాలెంలో ఇటీవల మృతి చెందిన స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్, మండల వర్తక సంఘం సభ్యుడు కొల్లుశెట్టి సత్యం (పలావు సెంటర్ స్వామి) కుటుంబ సభ్యులకు వర్తక సంఘ ప్రతినిధులు ఆర్థికసాయం అందజేశారు. పలావు సెంటర్ స్వామి గత శనివారం రాత్రి కరప మండలం గొర్రిపూడి వద్ద తుల్యభాగ నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డ విషయం తెలిసిందే. గురువారం వర్తక సంఘం నాయకులు కొప్పుశెట్టి లక్ష్మీనారాయణ, ఆకుల బాబీ, కొల్లుశెట్టి బాబీ, నాగు, బిరుదా రవి, గొల్లపల్లి చిన్నా, గుండా రాంబాబు, బిరుదా త్రిమూర్తులు తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సంఘం తరఫున రూ.10 వేల నగదును అందజేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం



రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ సెక్షన్‌లోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ మేడిశెట్టి వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు సూచనల మేరకు రామచంద్రపురం నుంచి కొత్తపేట, ముమ్మిడివరం 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రం, 132 కేవీ డబుల్ సర్క్యూట్‌లో ఉన్న పాడైన టవర్లను తొలగించి, కొత్తవి ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా, 33/11 కేవీ, 11 కేవీ లైన్ క్రాసింగ్ ఉండటం కారణంగా ద్రాక్షారామ సెక్షన్‌లోని 11 కేవీ తాళ్లపాలెం ఫీడర్ పరిధిలో ట్రీ ట్రిమ్మింగ్ కోసం విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని వివరించారు. నెలపర్తిపాడు, వెలంపాలెం, గణపతినగరం, పెద్ద తాళ్లపాలెం, చిన్న తాళ్లపాలెం, ఉట్రుమిల్లి, రత్నాలగరువు గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

ఆలమూరు: జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించే వరకూ రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన చేయకూడదంటూ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రవికుమార్ అన్నారు. ఆలమూరులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా విద్యారంగంలో అనేక సమస్యలు పరిష్కరించాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. స్థానిక జూనియర్ కళాశాల శిథిలావస్థకు చేరినా, పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. దీనివల్ల అందులో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. పేద, బలహీన వర్గాలకు ఉచిత విద్య కొరవడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి, సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

గోశాలకు పశుగ్రాసం వితరణ

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామివారి సన్నిధిలోని గోశాలలో ఉన్న గోవులకు నగరం గ్రామానికి చెందిన ముడకల శ్రీనివాస్, అతని కుటుంబ సభ్యులు గురువారం 45 మోపుల ఎండుగడ్డిని వితరణగా ఇచ్చారు. నిత్యాన్నదానం ట్రస్టుకు మొగలికుదురుకు చెందిన ములికికోట సత్యసాయిరామ్, విజయలక్ష్మికోటేశ్వరి రూ.10,116 విరాళంగా అందించారు.

భూసారానికి సేంద్రియ దన్ను

- చేలకు ఈ ఎరువుతో ప్రయోజనాలెన్నో..
- అన్ని రకాల పంటలకూ వినియోగం
- ఖరీఫ్ పనులకు సన్నద్ధమైన రైతులు



పొలాల్లో వేసిన పశువుల ఎరువు

రాయవరం: సేంద్రియ ఎరువుల వినియోగం ఎక్కువగా చేపట్టాలని వ్యవసాయాధికారులు సిఫార్సు చేస్తున్నారు. రసాయన ఎరువులు అధికంగా ఉపయోగించడం వల్ల సూక్ష్మ పోషక లోపాలతో భూసారం తగ్గుతుంది. ఏ ఒక్క సూక్ష్మ పోషక లోపం ఉన్నా దిగుబడి తగ్గిపోతుంది. అందుకే సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల భూసారంతో పాటు దిగుబడులూ గణనీయంగా పెరుగుతాయి. ప్రస్తుతం రైతులు ఖరీఫ్ పనులకు సన్నద్ధమవుతున్నారు.

క్లస్టర్‌లో ఇలా..

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాల పరిధిలో 1.01 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంది. ప్రస్తుతం రబీ పనులు ముగింపు దశకు చేరాయి. రైతులంతా ఖరీఫ్‌కు సన్నద్ధం కావడంలో భాగంగా పొలాల్లో సేంద్రియ ఎరువును వేసుకునే పనిలో ఉన్నారు. ట్రాక్టర్లపై పశువుల పెంట, కంపోస్టు ఎరువులతో పాటుగా, చెరువు మట్టిని కూడా పొలాల్లో వేసి, భూమిని సారవంతమయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు.

పశువుల ఎరువు

చాలా మంది రైతులు పశువుల ఎరువును గోతిలో వేసి మాగేస్తారు. ఇటువంటి పశువుల ఎరువును ఖరీఫ్‌కు ముందు పొలాల్లో చల్లుకోవాలి. పశువుల ఎరువులో 0.5 నుంచి 1.5 శాతం నత్రజని, 0.3 నుంచి 0.9 శాతం భాస్వరం, 0.5 నుంచి 1.9 శాతం పొటాషియం ఉంటాయి. ఈ పోషకాలు నష్టపోకుండా ఉండాలంటే పశువుల ఎరువును సరైన పద్ధతిలో వినియోగించాలి. ముందుగా 20/5/3(పొడవు, వెడల్పు, లోతు) అడుగుల గొయ్యిని తయారుచేయాలి. గొయ్యిలో పశువులు తొక్కిన గడ్డిని, మూత్రం వేసిన గడ్డిని పొరలుగా వేసి, అందులో పశువుల ఎరువును గొయ్యి పైకి అరమీటరు ఎత్తు వరకు వేసి, మట్టితో కానీ, పేడతో కానీ అలకాలి. ప్రతి టన్ను పశువుల పేడకు కిలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చొప్పున గోతిలోని పొరల మధ్య చల్లితే, బాగా కుళ్లి మంచి పశువుల ఎరువు తయారవుతుంది. ఇలా తయారైన పశువుల ఎరువును పొలానికి తొలి కుప్పలుగా వేయాలి. దీనిని చేలలో చల్లడానికి మూడు, నాలుగు వారాల ముందు నిలువుగా, అడ్డంగా భూమిని దున్ని, సేంద్రియ ఎరువును చల్లాలి. పశువుల ఎరువులో సేంద్రియ పదార్థం 32శాతం మాత్రమే ఉంటుంది. కాబట్టి పొలాలకు ఎక్కువ పరిమాణంలో వాడాల్సి ఉంటుంది.

కంపోస్టు ఎరువు

రెండు లేదా మూడు పశువులు కలిగి ఉన్న రైతు దీనిని సులభంగా తయారు చేయవచ్చు. ఆరు మీటర్ల పొడవు, మీటరు వెడల్పు, మీటరు లోతు ఉన్న రెండు గోతులు తవ్వాలి. ఒక్కో గోతిని, వెదురు కర్రలతో ఆరు పొరలుగా విభజించాలి. పశువుల కొట్టాం, పొలంలోని వ్యర్థ పదార్థాలతో పాటు, అంతే పరిమాణం కలిగిన మట్టిని గోతుల్లో వేయాలి. ఇలా ఐదు నుంచి ఆరు రోజుల పాటు గుంతపై భాగం ఒకటిన్నర అడుగుల వరకు వచ్చేలా వేసి మట్టితో అలకాలి. రెండో గోతిని కూడా వ్యర్థాలతో నింపి, సుమారు రెండు నెలల పాటు మగ్గనిచ్చి, ఎరువుగా వాడుకోవచ్చు.

చెరకు ఎండుటాకు కంపోస్టు

చెరకు పంట నుంచి ఎకరానికి సుమారు మూడు టన్నుల చెరకు చెత్త వ్యర్థంగా లభిస్తుంది. దీనిని కాల్చకుండా, కంపోస్టు తయారు చేసుకుని పొలానికి వాడడం వల్ల లాభం ఉంటుంది. ముందుగా 6/2/1 మీటర్ల గొయ్యిని తీసి, అందులో 15 సెం.మీ. మందం వరుసల్లో చెరకు చెత్తను పర్చాలి. ప్రతి వరుసపై కంపోస్టు కల్చరు కానీ, యూరియా, సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్‌తో పాటు పేడ నీరు చల్లాలి. నేల మట్టానికి కొంచెం పై వరకు వచ్చేలా గొయ్యిలో చెరకు చెత్త వరుసలు వేయాలి. అనంతరం గొయ్యిని మట్టితో కప్పాలి. ఆరు నెలల తర్వాత చూస్తే నాణ్యమైన ఎరువు తయారవుతుంది. గొయ్యి ఎప్పుడూ తడిగా ఉండేలా చూసుకోవాలి. తయారైన కంపోస్టును ఎకరానికి టన్ను చొప్పున సేంద్రియ ఎరువుగా వాడుకోవచ్చు. చెరుకు ఎండుటాకు కంపోస్టులో సేంద్రియ పదార్థం 38 శాతం, నత్రజని 0.70 శాతం ఉంటాయి. ఇలా భూమిలో కుళ్లే ఎటువంటి ఆకులనైనా పేడతో కుళ్లబెట్టి, సేంద్రియ ఎరువులను తయారు చేయవచ్చు.

భూమి సారవంతం



సేంద్రియ ఎరువులతో భూమి సారవంతమవుతుంది. ముఖ్యంగా పశువుల పెంట, పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెరుగుతుంది. ఖరీఫ్‌లో ఎరువుల వినియోగం తగ్గుతోంది. రైతులు భూసారాన్ని పెంచేందుకు సేంద్రియ ఎరువులను రబీకి, ఖరీఫ్‌కు మధ్యలో పొలాల్లో వినియోగించాలి.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

దేవస్థానం భూముల కౌలు వేలం ఖరారు



ఆలయ ప్రాంగణంలో వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

కాజులూరు: మండలంలోని కోలంకలో ఉన్న శ్రీదేవి, భూదేవీ సమేత కేశవస్వామి, సోమేశ్వర స్వామి ఆలయాలకు చెందిన సాగు భూమి కౌలుకు వేలం పాటలు ఖరారైనట్టు కేశవస్వామి ఆలయ కార్య నిర్వహణాధికారి సోమరాజు తెలిపారు. గురువారం కోలంక కేశవస్వామి ఆలయ ప్రాంగణంలో అధికారులు కౌలు వేలంపాట నిర్వహించగా, కోలంక ఆలయానికి చెందిన ఆరు ఎకరాలకు గతంలో రూ.1.50 లక్షల లీజు ఉండగా, ప్రస్తుతం శీలం నాగేశ్వరరావు ఏటా రూ.1.71 లక్షలకు వేలం పాడుకున్నారన్నారు. అలాగే సోమేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 7.67 ఎకరాలకు గతంలో రూ.1.80 లక్షల లీజు ఉండగా, ప్రస్తుతం బోండా వెంకట బాబు రూ.2.02 లక్షలకు పాడుకున్నారని ఈఓ తెలిపారు. మూడేళ్ల పాటు కౌలుదారులకు ఇదే లీజు వర్తిస్తుందని, ఏడాది లీజు మొత్తం ముందుగానే చెల్లించాలన్నారు. యండమూరి సత్రం కార్య నిర్వహణాధికారి కృష్ణారెడ్డి ఈ కౌలు వేలంలో ప్రత్యేకాధికారిగా వ్యవహరించారు. కోటిపల్లి సాగునీటి సంఘం అధ్యక్షుడు దాట్ల విజయగోపాలరాజు, ఆలయ గుమస్తా రఘు, స్థానిక నాయకులు సుబ్బరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పుస్తకాల పంపిణీ



మండపేటలో పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న కో–ఆర్డినేటర్ మమ్మీ

కపిలేశ్వరపురం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలను సకాలంలో, ప్రణాళికాబద్ధంగా అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ మమ్మీ తెలిపారు. మండపేట పట్టణంలోని శ్రీగౌతమి పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర మండల స్టాక్ పాయింట్‌లో భద్రపర్చిన పాఠ్య పుస్తకాలను గురువారం ఆమె పరిశీలించారు. వాటిని పాఠశాలలు, తరగతుల వారీగా విభజించి, హెచ్‌ఎంలకు స్వాధీనపర్చే ప్రక్రియను వేగవంతం చేయాలని విద్యా శాఖ మండల స్థాయి అధికారులను ఆదేశించారు. పీఎంశ్రీ స్కూల్ అయిన శ్రీగౌతమి మున్సిపల్ పాఠశాల, తాపేశ్వరం హైస్కూల్‌లో చేపట్టిన ప్లే ఫీల్డ్ పనులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. కేశవరం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఆమె వెంట జిల్లా ఏఎల్‌సీ కో–ఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఎంఈఓలు నాయుడు రామచంద్రరావు, చింతా సోమిరెడ్డి పాఠశాల హెచ్‌ఎంలు, సీఆర్‌ఎంటీలు శేషారావు, నారాయణరావు, వై.వెంకటలక్ష్మి, రామభద్రం ఉన్నారు.

మహనీయా.. ప్రభుత్వం కళ్లు తెరిపించు..

అంబేడ్కర్ విగ్రహానికి ఇంజినీరింగ్ కార్మికుల వినతి



మండపేటలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్మికులు

కపిలేశ్వరపురం (మండపేట): ఏళ్ల తరబడి ప్రభుత్వ సేవలందిస్తున్నారు. పట్టణవాసుల రోజువారీ అవసరాలను తీర్చడంలో వారి సేవలు అత్యవసరం. పెరుగుతున్న ధరల నేపథ్యంలో వారికి ఇస్తున్న వేతనాలు అరకొరగానే ఉన్నాయి. ఈరోజు కాకపోతే ఏనాడైనా తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తారన్న ఆశతో పని చేస్తూ వస్తున్నారు. ప్రభుత్వానికి ఎలాగూ మనసు లేదు. కనీసం అడిగితే ఆలోచిస్తారు కదా అని తమ న్యాయమైన డిమాండ్లను వినతి రూపంలో ప్రభుత్వానికి విన్నవించారు. అయినా స్పందించకపోవడంతో సమ్మెకు దిగారు. కొద్ది రోజుల తర్వాత వారి డిమాండ్లను పరిష్కరిస్తామంటూ ప్రభుత్వం నుంచి హామీ వచ్చింది. సంతోషం వ్యక్తం చేసిన కార్మికులకు కొద్దిరోజులకే ఆ హామీ ఒట్టిదేనని తేలింది. చేసేదేముంది. భారత రాజ్యాంగం శ్రామికులకు ఇచ్చిన నిరసన తెలపడమనే ఆయుధంతో పోరాడుతున్నారు. ఐదు రోజులుగా వివిధ పద్ధతుల్లో ప్రభుత్వాన్ని కోరుతున్నా.. స్పందన కానరాకపోవడంతో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. మహనీయా, మా మొరను ఆలకించే మనస్సు ఈ ప్రభుత్వానికి కల్పించవయ్యా అంటూ వేడుకున్నారు. మండపేట పురపాలక సంఘం ఇంజినీరింగ్ విభాగం అవుట్ సోర్సింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె గురువారంతో ఆరో రోజుకు చేరింది. స్థానిక బురుగుంట చెరువు వాటర్ ట్యాంక్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహనీయుల విగ్రహాల సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు మాట్లాడుతూ, పట్టణ ప్రజలకు రోజూ నీళ్లు ఇస్తున్న తమ జీవితాల్లో కన్నీళ్లు మిగులుతున్నాయంటూ వాపోయారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పాలపర్తి సుబ్బరాజు, సవరపు సంతోష్, మత్తాల రమేష్, తలాటి వెంకన్న, పిట్టా ప్రవీణ్, గంటి నవీన్‌కుమార్, వాసంశెట్టి వాసు, కప్పల సురేంద్ర, కప్పల అన్నవరం, మందపాటి గన్నియ్య, కొండేపూడి వెంకటేశ్వర్లు, గుండుపల్లి ప్రసాద్, సైనం భాస్కరరావు, టేకి వెంకన్న, బాలరాజు, సురేష్ కన్నా పాల్గొన్నారు.

ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



కపిలేశ్వరపురం గోదావరి గట్టున ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

కపిలేశ్వరపురం: మండలంలోని గౌతమి గోదావరి తీరాన ఉన్న గ్రామాల్లో గోదావరి గట్టు వెంబడి పలు చోట్ల ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ నెల 27న పి.గన్నవరం మండలం నాగుల్లంక శివారు పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోకి వచ్చే ఆచంట వద్ద నదిలోకి దిగిన ముగ్గురు ప్రమాదవశాత్తూ మృతి చెందారు. ఈ ఘటనకు ఒక్కరోజు ముందు 26న ముమ్మిడివరం మండలం కమిన పంచాయతీ శివారు సలాదివారిపాలెం వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగిన 8 మంది నీట మునిగి మృతిచెందారు. ఈ వరుస ఘటనల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గోదావరి నది వెంబడి లోతైన ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కపిలేశ్వరపురం మండలంలోని కేదారిలంక, నారాయణలంక, కపిలేశ్వరపురం, తాతపూడి గ్రామాల వెంబడి నదీ తీరంలో గురువారం రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారుల సమన్వయంతో హెచ్చరిక బోర్డులను నెలకొల్పారు. తహసీల్దార్ చిన్నారావు, ఎంపీడీఓ జి.రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో ఆయా గ్రామాల కార్యదర్శులు శివచక్రవర్తి, చిన్నబాబు, బ్రహ్మాజీరావు, వీఆర్వోలు సాకా సత్యనారాయణ, వెన్నేటి రామకృష్ణ, తణుకు వెంకటేశ్వరరావు, సాదే శ్రీనివాస్ బోర్డుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముందస్తు చర్యలు చేపట్టాలి

కాజులూరు: మండలంలోని పంట కాలువలు, డ్రైనేజీలు, చెరువుల వద్ద ఉన్న ప్రమాదకర స్థలాలను గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ ఆదేశించారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాజులూరులో ఆయన మాట్లాడుతూ, ఇటీవల గోదావరిలో పలు ప్రమాదాలు జరిగిన నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాల్లో పంట కాలువలు, డ్రైయినేజీలు, చెరువుల వద్ద ఉన్న ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, హెచ్చరికలు తెలిపే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులను, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ విషయంలో గ్రామస్తులు సహకారం అందించి, సంఘటన స్థలాలు గుర్తిస్తే ప్రమాదాల నివారణకు ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ మాటలు ఉత్తేజాన్నిచ్చాయి



తాడేపల్లిలో వైఎస్ జగన్‌తో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, చైర్‌పర్సన్ దుర్గారాణి తదితరులు

మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మున్సిపల్ కౌన్సిల్ వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధుల సమావేశంలో పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటలు తమకు ఉత్తేజాన్నిచ్చాయని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. బుధవారం తాడేపల్లిలో పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి చైర్‌పర్సన్‌తో పాటు, విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు హాజరయ్యారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో సామాన్య ప్రజలు నానా యాతనలు పడుతున్నారన్న విషయాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని దుర్గారాణి గురువారం తెలిపారు. ప్రస్తుత పాలనా తీరును విశ్లేషిస్తూ, ప్రజలకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉండాలంటూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటలు.. ప్రస్తుత వాస్తవిక రాజకీయ స్థితిగతులకు అద్దం పట్టాయన్నారు. పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నాయకత్వంలో పట్టణ ప్రజల సమస్యలపై పోరాడుతామని ఆమె చెప్పారు. అధినేతను కలిసిన వారిలో నాయకులు కొమ్ము రాంబాబు, పతివాడ రమణ తదితరులున్నారు.

విగ్రహావిష్కరణ వివాదానికి తెర

అధికారులు, ప్రజాప్రతినిధుల చొరవతో సద్దుమణిగిన వైనం



అంతర్వేదికరలో పరిస్థితిని సమీక్షిస్తున్న డీఎస్పీ, ఆర్డీఓ, ఎమ్మెల్యే



రంగా విగ్రహానికి ముసుగు వేస్తున్న సిబ్బంది

సఖినేటిపల్లి: అంతర్వేదికర గ్రామంలో రెండు సామాజిక వర్గాల మధ్య రంగా విగ్రహావిష్కరణలో తలెత్తిన వివాదానికి తెరపడింది. గురువారం ఇరు వర్గాల మధ్య తలెత్తిన వివాదం నేపథ్యంలో.. ఆయా వర్గాల వారితో అమలాపురం ఆర్డీఓ కొత్తమాధవి, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ జరిపిన చర్చలు ఫలించాయి. చర్చల్లో ఇరు సామాజిక వర్గాలు సామరస్య వాతావరణంలో ఏకాభిప్రాయానికి వచ్చారు. రంగా విగ్రహం సరైన రీతిలో ఇరువర్గాలు సమష్టిగా ప్రారంభించేలా, క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారానికి ఈ నెల 31న సీఎం పర్యటన పూర్తయ్యే వరకూ గడువు విధించి.. అధికారులు విగ్రహానికి ఉన్న ముసుగు తొలగించారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని కొత్తపేట సెంటర్‌లో ఎల్‌ఎఫ్ చానల్‌పై ఉన్న కల్వర్టుకు ఒకవైపు అంబేడ్కర్ విగ్రహం ఇప్పటికే ఏర్పాటు చేశారు. రెండో వైపు బస్టాండ్‌కు చేరి రంగా విగ్రహం ఏర్పాటుకు ఓ సామాజిక వర్గం ఇటీవల సన్నాహాలు చేస్తూ వచ్చింది. ఈ క్రమంలో పంచాయతీ తీర్మానాన్ని అనుసరించి ఆ వర్గం ఈరోజు తెల్లవారుజామున రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. విగ్రహం ఏర్పాటుకు అధికారుల అనుమతి లేదంటూ, విగ్రహాన్ని తొలగించాలని మరో వర్గం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు వచ్చి శాంతిభద్రతల దృష్ట్యా విగ్రహాన్ని సమీప ఇంటి ఆవరణలోకి చేర్చారు. తెల్లవారక తిరిగి అదే విగ్రహాన్ని యథాతథంగా ఆ వర్గం వారు పెద్దఎత్తున తరలివచ్చి మరోసారి ఆవిష్కరించారు. ఈ క్రమంలో గ్రామంలో రెండు సామాజిక వర్గాల మధ్య వివాదం ముదిరింది. ఈ పరిస్థితుల్లో కొత్తపేట డీఎస్పీ ఘటనా స్థలానికి చేరుకుని శాంతి భద్రతలను పర్యవేక్షించారు. కోనసీమలోని పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి, ఇరు వర్గాలను చెదరగొట్టారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం వివాదం శాంతియుతంగా పరిష్కరించే క్రమంలో స్థానిక పంచాయతీలో ఇరు వర్గాలతో అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. తొలుత ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తినా, అధికారులు దఫదఫాలుగా వారికి నచ్చజెప్పి ఎట్టకేలకు ఓ అంగీకారానికి తెచ్చారు. కల్వర్టుకు ఓ వైపునున్న అంబేడ్కర్ విగ్రహం ఎత్తు కంటే తక్కువ ఎత్తులో అదే చోట రంగా విగ్రహం పెట్టడానికి మరో వర్గం సూత్రప్రాయంగా అంగీకరించడంతో చర్చలు సఫలమయ్యాయి. అయితే రంగా విగ్రహం దిమ్మ పక్కనే జాతీయ జెండా దిమ్మ కట్టడానికి అధికారులు తగిన నిర్ణయాలు తీసుకోవడానికి, అంతవరకూ రంగా విగ్రహానికి ముసుగు వేయడానికి అంగీకారానికి వచ్చారు. చివరగా డీఎస్పీ, ఆర్డీఓ, ఎమ్మెల్యే సమక్షంలో తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కె.సూర్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది విగ్రహానికి ముసుగు వేయడంతో పరిస్థితి సద్దుమణిగింది.

తరగతి గదుల నిర్మాణాలను పూర్తి చేయాలి



విద్యార్థుల తరఫున గ్రామాధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న సర్పంచ్

కపిలేశ్వరపురం: నల్లూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలంటూ పంచాయతీ అధికారులకు పాఠశాల విద్యార్థులు వినతిపత్రాన్ని అందజేశారు. సర్పంచ్ కురుపూడి ఉదయశ్రీ, గ్రామ నాయకుడు కురుపూడి రాంబాబు ఆధ్వర్యంలో శ్రమ స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ ఆర్గనైజర్ శారద సహకారంతో గురువారం పంచాయతీ అధికారులకు వారు వినతిపత్రాన్ని అందించారు. సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాల భవనం బీటలు వారి అధ్వానంగా మారిందని, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు పునాది దశలో నిలిచిపోయాయన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో త్వరితగతిన పనులను పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు కోరారు. గత ప్రభుత్వ హయాంలో 2022 ఆగస్టు 20న రూ.51,99,977 నిధులతో ఎనిమిది తరగతి గదుల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారన్నారు. పాఠశాలలో 65 మంది బాలురు, 82 మంది బాలికలు మొత్తం 147 మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు.

ఆయిల్ మిల్లులో తాచుపాము హల్‌చల్



తాచుపామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ వర్మ

అంబాజీపేట: సుమారు ఆరు అడుగుల గోధుమ రంగు తాచుపాము బుధవారం స్థానిక విజ్జపు వెంకటరాజు ఆయిల్ మిల్లులో చేరి స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. అప్రమత్తమైన వెంకటరాజు వెంటనే స్నేక్ క్యాచర్ వర్మను సంప్రదించారు. ఆయన అక్కడకు చేరుకుని రేకుల కింద నక్కిన తాచుపామును పట్టుకుని, డబ్బాలో బంధించారు. ఆ పామును నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి విడిచిపెట్టారు. ఇది చాలా ప్రమాదకరమైన పాము అని వర్మ తెలిపారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

రావులపాలెం: జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా రావులపాలెం నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణతో పాటు, పలు క్షేత్రాలను దర్శించుకునేలా ప్రత్యేక బస్సును జూన్ ఆరో తేదీన ఏర్పాటు చేసినట్టు రావులపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్ జీజీవీ రమణ గురువారం తెలిపారు. గిరి ప్రదక్షణతో పాటు, తిరుపతి, కాంచీపురం, శ్రీపురం, కాణిపాకం, శ్రీకాళహస్తి, విజయవాడ యాత్రకు సూపర్ లగ్జరీ సర్వీసు ఏర్పాటు చేశామన్నారు. జూన్ ఆరున రావులపాలెం నుంచి బయలుదేరి, ఆయా క్షేత్రాల దర్శనం అనంతరం జ్యేష్ఠ పౌర్ణమి రోజున అరుణాచలం గిరి ప్రదక్షిణ అనంతరం 13వ తేదీన రావులపాలెం చేరుతుందని వివరించారు. ఐదు రోజుల యాత్రకు టికెట్ ధర రూ.3,500గా నిర్ణయించామన్నారు. వివరాలకు డిపో మేనేజర్ 99592 25537, అసిస్టెంట్ మేనేజర్ 73829 11871 నంబర్లలో సంప్రదించాలన్నారు.